క్లుప్తంగా...

నేడు, రేపు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

చార్మినార్: ఈనెల 16, 17వ తేదీల్లో పాతబస్తీలో నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలు, సామూహిక ఘటాల ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని నగర ట్రాఫిక్ అడిషనల్ పోలీసు కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. దక్షిణ మండలంలోని ఫలక్‌నుమా, చార్మినార్, మీర్‌చౌక్, బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నందున వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లింపు ఉంటుందన్నారు. ఈనెల 16 నుంచి 17వ తేదీ రాత్రి 11 గంటల వరకు దారి మళ్లింపులు ఉంటాయన్నారు.

బోనాలు తెలంగాణ ప్రత్యేకం



గోల్కొండ: దర్బార్ మైసమ్మ ఉమ్మడి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ అమర్ సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి బోనాల ఆహ్వాన పత్రికను ఆయనకు అందించారు.

బోనాలకు అదనపు బలగాలతో బందోబస్తు



సాయి చైతన్య

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జరగనున్న బోనాలకు అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. దక్షిణ మండలంలోని పోలీసు సిబ్బందితో పాటు అదనపు బలగాలతో బందోబస్తు కొనసాగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నలుగురు అదనపు డీసీపీలు, 16 మంది డీఎస్పీలు, 28 మంది సీఐలు, 500 మంది పీసీలతో పాటు 15 ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ, సీఏఆర్ పోలీసు సిబ్బంది, ఒక కంపెనీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ల అదనపు బందోబస్తును నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు ఈ బందోబస్తు కొనసాగుతుందన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు



లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ బెజిలీ మహంకాళి ఆలయం వద్ద బొడ్రాయి మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ బొడ్రాయి స్థాపించి మండల రోజులు పూర్తి కావడంతో శనివారం ఉదయం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్దయెత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో లంగర్‌హౌస్‌లోని వివిధ బస్తీల పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం



నూతన భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

సంతోష్‌నగర్: విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. హఫీజ్‌బాబానగర్ ఓమర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నజామున్నీసా ఎడ్యుకేషనల్ క్యాంపస్ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తే ఆశించిన ఫలితాలను సాధించవచ్చునన్నారు. కార్పొరేటర్లు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



చార్మినార్: గౌలిపురా కోట మైసమ్మ ఆలయానికి లక్షా వెయ్యి రూపాయల నగదును విరాళంగా ఇచ్చినట్లు ఆలయం కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఎస్.ఆనంద్‌రావు తెలిపారు. ఈ వారం రాత్రి ఆలయం కమిటీ అధ్యక్షుడు కైలాష్ ముదిరాజ్ సమక్షంలో అమ్మవారికి ఈ నగదును సమర్పించినట్లు ఆయన వెల్లడించారు.

గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం



అబిడ్స్: రాబోయే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి మధుసూదన్‌గుప్తా పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్, బీజేపీలు కేవలం ప్రకటనలే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌ను గెలిపిస్తారని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. పోతరాజుల నృత్యాలు, ఆటాపాటలతో అమ్మవార్లకు బోనం సమర్పించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



విజయవాడ దుర్గ గుడి ఈవో, బోర్డు చైర్మన్‌లకు స్వాగతం పలుకుతున్న కే.ఎస్.ఆనంద్‌రావు, కైలాస్ ముదిరాజ్



ఉప్పుగూడ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్



వేడుకల్లో ఎమ్మెల్సీ ప్రభాకర్, ఠాకూర్ అమర్‌సింగ్, మిత్రకృష్ణ, కొమ్ముల నరేందర్



లంగర్ హౌస్ ఊరేగింపులో కృష్ణ యాదవ్ దాతలు శ్రీనివాస్‌గౌడ్ గోపీగౌడ్ కుటుంబీకులు



శాంతి కల్యాణోత్సవంలో కైలాష్ గంగపుత్ర కుటుంబసభ్యులు



మాతేశ్వరీ పోచమ్మ ఆలయంలోకి చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు



జియాగూడ మహంకాళికి స్కాల్ స్కూల్‌లో..



పోతరాజులతో బీఆర్ఎస్ యువ నాయకుడు మిత్ర అభిషేక్ తదితరులు



శాంతినగర్ శ్రీ శ్లోకా స్కూల్‌లో..



ఛత్రినాకలో బోనాల వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న అఖిల డ్యాన్స్ అకాడమీ చిన్నారులు

బోనాలకు ఆహ్వానం

బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా పలువురు ప్రముఖులకు ఆలయాల ప్రతినిధులు శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.

– జోన్ బృందం



మంత్రి తలసానిని ఆహ్వానిస్తున్న బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు



రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు కే.ఎస్.ఆనంద్‌రావు, కాశమోని శ్యాంరావు ముదిరాజ్



మంత్రి తలసానికి ఆహ్వానాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

నేడు లాల్‌దర్వాజా బోనాలు



లాల్‌దర్వాజా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన బోనాల సమర్పణకు లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచే బోనాల సమర్పణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలయానికి రెండు వైపులా బోనాల క్యూ కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచే ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ ఏర్పాట్లు చేయడంలో తలమునకలయ్యారు. అమ్మవారికి మట్టి కుండలో బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో కుండల క్రయ విక్రయాలు కూడా పెద్ద ఎత్తున కొనసాగాయి. ఆలయ పరిసరాల్లో బాంబు, డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

దేవి మహా అభిషేకంతో బోనాలు ప్రారంభం..

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో ఆదివారం ప్రాతఃకాలం 4 గంటలకు బలిహరణ, అనంతరం ఉదయం 6 గంటలకు మాజీ రాజ్యసభ సభ్యుడు దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా దేవి మహాభిషేకం ఉంటుంది. తదనంతరం బోనాల సమర్పణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్ తెలిపారు. రాత్రి 8 గంటలకు శాంతి కల్యాణం ఉంటుంది.

పోలీస్ నిఘాలో ఆలయం..

లక్షకు పైగా భక్తజనం వచ్చే లాల్‌దర్వాజా బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం ఇప్పటికే పోలీస్ నిఘాలోకి వెళ్లిపోయింది. శాంతి భద్రతల పోలీసులతో బాంబు, డాగ్ స్క్వాడ్, ఇంటిలెజెన్స్ వర్గాలు ఆలయ పరిసరాల్లో పెద్ద ఎత్తున మోహరించారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, ఛత్రినాక ఇన్‌చార్జి ఏసీపీ దామోదర్‌రెడ్డి, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

'గాంధర్వం-సాధనాత్ సాధ్యం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రామలింగేశ్వరరావు, ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత నృత్యాలను, లలిత కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి ఎ.రాలింగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నవ్య నాటక సమితి సంయుక్తాధ్వర్యంలో ఎన్టీఆర్ కళా మందిరంలో రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సు 'గాంధర్వ-సాధనాత్ సాధ్యం'అనే గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావుతో కలిసి గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. గౌరవ అతిథులు జి.వసుంధర, ఆచార్య టి.గౌరీ శంకర్ కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ సదస్సులో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు వర్సిటీ నృత్య శాఖాధిపతి డాక్టర్ వనజా ఉదయ్ కార్యక్రమాన్ని సమీక్ష చేస్తూ వందన సమర్పణ చేశారు.

ఆదినారాయణ, శేజల్ మోసాలపై విచారణ చేపట్టాలి



సుల్తాన్‌బజార్: అరిజిన్ సంస్థ పేరుతో పాడి పరిశ్రమ రుణాలు, గేదెలకు, ఆవులకు ఇన్సూరెన్స్, నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రలో అమాయక రైతులు, ప్రజా ప్రతినిధులను మోసం చేస్తున్న అరిజిన్ డైరీ సంస్థ డైరెక్టర్లు కందిమళ్ల ఆదినారాయణ, శేజల్‌లపై ప్రభుత్వం విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని నేతకాని మెహర్ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ బోర్లకుంట దీపక్ కుమార్ డిమాండ్ చేశారు. వారి అక్రమాలను ప్రశ్నించిన వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన బాధిత రైతులతో కలిసి వారు మాట్లాడుతూ.. ఆదినారాయణ, శేజల్‌పై నార్త్‌జోన్ డీసీసీపీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితులు సంతోష్ కుమార్, శ్రీపతి బుచ్చన్న, జాడి రాజేష్, ఎస్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి



నాంపల్లి: ఉద్యోగులు ఆరోగ్యవంతంగా ఉంటే, ఆ సంస్థ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని దీని దృష్ట్యా గనులు, కార్యాలయాల్లోనూ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సంస్థ (ఫైనాన్స్, పర్సనల్) డైరెక్టర్ ఎస్.బలరామ్ అన్నారు. నగరంలోని సింగరేణి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ఆయన జనరల్ మేనేజరు కో- ఆర్డినేషన్ ఎం.సురేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ కోట్ల రూపాయలు వెచ్చించి వైద్య విభాగాన్ని ఆధునీకరించిందని, అలాగే దాదాపు 120 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తుందన్నారు. అంతేకాక గనులు, కార్యాలయాల్లో కూడా ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. జీఎం (కోఆర్డినేషన్) ఎం.సురేష్ మాట్లాడుతూ... కంపెనీలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుంటుందన్నారు. డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాల కోటయ్య మాట్లాడుతూ..నగరంలోని ప్రముఖ ఆసుపత్రులు మెగా వైద్య శిబిరంలో పాలుపంచుకున్నాయన్నారు.

డాక్టర్ అనురాధకు ఎస్పీహెచ్ఓ ఉత్తమ అవార్డు



అబిడ్స్: ఎస్పీహెచ్ఓ డాక్టర్ అనురాధకు ఉత్తమ అవార్డు లభించింది. గోల్కొండ జోన్ ఎస్పీహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అనురాధకు డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, ఇతర అధికారులు ఆమెకు అవార్డు అందజేసి అభినందించారు. కరోనాలో సైతం ప్రాణాలు లెక్కచేయకుండా డాక్టర్ అనురాధ ఉత్తమ విధులు నిర్వహించింది. ఆమె ఉత్తమ విధులను పరిగణలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖ ఈ అవార్డు అందజేసింది.

నర్మదా బచావో ఆందోళనలో ఎన్నో కష్టాలు పడ్డా

– మేధా పాట్కర్

సుల్తాన్‌బజార్: రామ్ మనోహర్ లోహియా సమతా న్యాస్, లోహియా విచార్ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో మధుద్వయం అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ సుభాషణ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నర్మదా బచావో ఉద్యమకారిణి, సామాజిక వేత్త మేధా పాట్కర్ హాజరై మధుద్వయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. నర్మదా బచావో ఆందోళనలో భాగంగా ఆదివాసీ మహిళలతో ముంబాయి వెళ్లామని, ఈ తరుణంలో తమను జైల్లో వేశారని గుర్తు చేశారు. నర్మదా బచావో ఆందోళనతో తాను ఎన్నో కష్టాలు అనుభవించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రఫుల్ల సమంతార్, గోపాల్‌సింగ్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేధా పాట్కర్

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



గోల్కొండ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఇవే చివరి గడియలని, అసెంబ్లీ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. ఆయనను కలిసిన వారిలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకుడు డాక్టర్ భగవంతరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రాచీన కళలకు పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాచీన కళలకు పెద్దపీట వేసి తగిన గుర్తింపును తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో కందుల కూచిపూడి నాట్యాలయం 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువు వేదాంతం సత్యనరసింహా శాస్త్రిని ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డి, సంస్థ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ఎం.రాములు తదితరులు

అబిడ్స్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీస్తే వారు అత్యద్భుతాలు సృష్టిస్తారని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.రాములు పేర్కొన్నారు. అరోరా కాలేజీలో నిర్వహించిన 2023 టెక్నో మేనేజ్‌మెంట్ కార్నివాల్‌ను కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ దేవేందర్, యునైటెడ్ హెల్త్ గ్రూప్ ఫైనాన్స్ అడ్వైజర్ వినోద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రొఫెసర్ రాములు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికి తీయడమే అధ్యాపకుల ప్రథమ విధి అయన అన్నారు. ఈ కార్నివాల్‌లో విద్యార్థులకు బిజినెస్ క్విజ్, డీ బగ్గింగ్, ప్రాజెక్ట్ ప్రకల్ప్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదేశ్‌చంద్ర పట్నాయక్, అధ్యాపకులు ఎస్.విజయ, దీపిక, ఆరీఫా బేగం, అనుదీప్, సుష్మాచౌదరి పాల్గొన్నారు.

అసాధారణ సాంస్కృతిక గాయకుడు సాయిచంద్

సుల్తాన్‌బజార్: అసాధారణ సాంస్కృతిక సైనికుడు సాయిచంద్ అని ప్రభుత్వ సిటీ కాలేజ్ తెలుగు శాఖ అధిపతి డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అన్నారు. ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో వేద సాహిత్య సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని వక్తలుగా ప్రముఖ గాయకుడు యశ్పాల్, మాంచాల లింగస్వామి, దాసరి శ్యామ్ మనోహర్, బీఎస్.మధు ప్రసంగించారు. తెలంగాణ ఆట మాట పాట మలిదశ తెలంగాణ ఉద్యమం చైతన్యవంతం చేసిన గొప్ప గాయకుడు సాయిచంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి ముట్టడి

నాంపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉండే 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేసే 1445 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముట్టడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వానికి అనేకమార్లు విజ్ఞప్తి చేసినా తమను విస్మరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ అభ్యంతరాలను సాకుగా చెబుతూ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో కేసీఆర్ నేర్పించిన ఉద్యమ స్ఫూర్తితోనే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

శిఖర హారతి

బోనాల ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆల య శిఖర హారతి కార్యక్రమం శుక్రవారం రాత్రి కనుల పండువగా కొనసాగింది. వేలా ది మంది మహిళా భక్తులు హాజరై శిఖరానికి ఒకేసారి హారతి ఇవ్వడంతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. – చాంద్రాయణగుట్ట

